ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 15, ఏప్రిల్ 2026



# వైభవంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

● మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరు ● సింగరేణి గ్రీన్ పార్క్‌లో ఘన వేడుకలు

మందమర్రి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త

భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మందమర్రి ఏరియాలోని సింగరేణి గ్రీన్ పార్క్‌లో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు మంత్రికి ఘన స్వాగతం పలికిన అనంతరం పతాక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అనంతరం మంత్రి, ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన, కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ హిందీ పండిట్ జామి ప్రసాద్ రావు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించగా, ఆయన రచనకు డీజీఎం ఐఈ కె. కిరణ్ కుమార్ సంగీతం అందించిన అంబేద్కర్ థీమ్ సాంగ్‌ను విడుదల చేశారు. కమ్యూనికేషన్ సెల్ బృందం ప్రదర్శించిన నృత్య కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకుంది. మంత్రి జి. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ అంబేద్కర్ సమాజంలో సమానత్వం కోసం చేసిన కృషిని కొనియాడారు. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొత్త బొగ్గు గనుల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. సింగరేణి అభివృద్ధికి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. జీఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఉద్యోగుల పాత్ర సింగరేణి అభివృద్ధిలో కీలకమని తెలిపారు. గుర్తింపు **మిగతా 2లో..**

# అంబేద్కర్ ఆశయ సాధనకు సమిష్టిగా కృషి చేద్దాం...

➩ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత

ఆసిఫాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త



డా. బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు సమిష్టిగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ హరిత పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల శాసనసభ్యులు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్ బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్దే అనిల్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మెంగ్రె ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి. అహ్మద్, కుల సంఘాల ప్రతినిధులు, అంబేద్కర్ సేవా సంఘం, లుంబిని దీక్ష సేవా సభ్యులతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే లు మాట్లాడుతూ అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడం, దేశంలోని అన్ని వర్గాల వారికి ఆర్థిక, సామాజిక, న్యాయ, రాజకీయ రంగాలలో సమన్యాయం జరగాలని ఆకాంక్షి ంచిన ప్రపంచ మేధావి అని కొనియాడారు. భారత రాజ్యాంగ రూపకర్త డా. బి.ఆర్. అంబేద్కర్ సమాజంలోని **మిగతా 2లో..**



# దేశం గర్వించదగ్గ మేధావి అంబేద్కర్

✳ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:

భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. మంగళవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు పంచశీల జెండాను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అంబేద్కర్ ప్రపంచం గర్వించదగ్గ గొప్ప మేధావి అని కొనియాడారు. సమసమాజ స్థాపనే లక్ష్యంగా ఆయన అహర్నిశలు శ్రమించారని, యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఇదే క్రమంలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్ చక్రవర్తి, ఆర్డీఓ రత్న కళ్యాణి, దళిత సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనతో

# దేశాభివృద్ధి సాధ్యం

✪ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త

రాజ్యాంగ నిర్మాత, సమానత్వ సమాజం కోసం కృషి చేసిన మహనీయుడు డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధన తో దేశాభివృద్ధి సాధ్యమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఐ.బి చౌరస్తాలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు **మిగతా 2లో..**



# వైభవంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)

యూనియన్ ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ కార్మిక హక్కుల పరిరక్షణపై తమ కట్టుబాటును వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఏ. భాస్కర్ ఐపీఎస్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్.ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్ కన్వీనర్, డీజీఎం పర్సనల్ సిహెచ్. అశోక్ అధ్యక్షుడు, ఎస్. రమేష్ సీఎంఓఏఐ, ఎస్. సురేష్ డీజీఎం ఈఅండ్ఎం, ఎస్. శ్రీధర్ ఎస్ఈ సివిల్, ఎ. చంద్రమోళి, జి. బాబు, దాసరి సుదర్శన్, కె. హరి రామకృష్ణ, టి. తారాచంద్, బానోత్ తిరుపతి, మహ్మద్ ముస్తఫా, పి. రాజు తదితరులు పాల్గొన్నారు. డివైపీఎం ఎం.డి. ఆసిఫ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. భారీ సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్ల పట్టివేత

- ఇద్దరు డ్రైవర్లు, ఓనర్లపై కేసులు నమోదు చేసిన పోలీసులు
- అక్రమంగా ఇసుక రవాణా చేస్తే పీడీ యాక్ట్ కేసులు పెడతాం
- చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ హెచ్చరిక

చెన్నూరు, ఏప్రిల్ 14 ప్రభాతవార్త



ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసినట్లైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని చెన్నూరు పట్టణ సీఐ బన్సీ లాల్ అక్రమార్కులను హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని పొక్కురు గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను చెన్నూరు పట్టణ సీఐ బన్సీ లాల్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొక్కురు గ్రామ సమీపంలో గల గోదావరి నుండి ఇసుక తరలిస్తుండగా రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి, ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించామన్నారు. డ్రైవర్స్, ఓనర్స్ పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రాత్రి వేళలో పోలీసుల పహారా ఎక్కువగా నడుస్తుందని, అక్రమార్కులు మిట్ట మధ్యాహ్నం సమయంలో అక్రమ మార్గాల్లో ఇసుక తరలించేందుకు సిద్ధపడినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేసినట్లయితే కఠిన చర్యలు తప్పవని అవసరమైతే పిడి యాక్ట్ వంటి కేసులు కూడా పెడతామని సీఐ హెచ్చరించారు.




## రహదారి భద్రతపై అవగాహన సదస్సు

లక్షెట్టిపేట, ఏప్రిల్ 14, ప్రభాతవార్త

లక్షెట్టిపేట మండలంలోని వెంకట్రావు పేట గ్రామం నందు రహదారి భద్రతపై అవగాహన కల్పించే కార్యక్రమం ఆరైవ్ ఆలైవ్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్టిఏ సభ్యులు అంకతి. శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ నలిమెల రాజు, వార్డు సభ్యులు హాజరయ్యారు. అలాగే మోటార్ వెహికిల్స్ ఇన్స్పెక్టర్లు, రవాణాశాఖ అధికారి రంజిత్ కుమార్, ఎంవిఐలు కిషోర్ చంద్ర రెడ్డి, కాసిం, సూర్య తేజ, శ్రీ సాయి, లెనిన, స్థానిక సీఐ డి రమణమూర్తి, వారి సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించి, వాటిలో ఉత్సాహాన్ని నింపడం జరిగింది. గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జన్మదిన సందర్భంగా పూలమాలలు వేసి స్థానికులతో ర్యాలీ తీయడం జరిగింది. అనంతరం గ్రామ సభలో క్రింది విషయాలను సూచించడం జరిగింది. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, తల్లిదండ్రులకు గ్రామ పెద్దలకు సూచించడం జరిగింది రోడ్డు మీద బాధ్యతగా ప్రవర్తించడం, ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించండి, అందరూ వాహనాల పత్రాలు సరిగ్గా ఉంచుకోవాలని సూచించడం జరిగింది. ఈ సంవత్సరం జరిగిన వాహనాల ప్రమాదాల సంఖ్యతో పాటు గాయపడిన మరణించిన వివరాలు తెలపడం జరిగింది.. అనంతరం ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.

## అంబేద్కర్ ఆశయ సాధనకు సమిష్టిగా కృషి చేద్దాం...

(మొదటిపేజీ తరువాయి)



అణగారిన వర్గాల అభివృద్ధి కోసం అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్యకు ప్రాధాన్యతనిచ్చారని, మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షి ంచారని తెలిపారు. సిర్పూర్ శాసనసభ్యులు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక్క భారతదేశానికి మాత్రమే గొప్ప కాదని, ప్రపంచ దేశాలు సైతం అంబేద్కర్ ఆలోచనలపై దృష్టి సారిస్తున్నాయని, అంతటి మేధావి భారత దేశ పౌరుడు కావడం గర్వంగా ఉందని తెలిపారు. యువత విద్యపై దృష్టి పెట్టి ఉన్నత రంగాలలో రాణించాలని, అప్పుడే ఆయనకు ఘనమైన నివాళి అని తెలిపారు. ఆసిఫాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం రాజ్యాంగ రచయిత మాత్రమే కాదని, సమాజంలో సమానత్వం, స్వేచ్ఛ, అంటరానితనం నిర్మూలన, సోదర భావం, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహనీయుడని, అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. అనంతరం అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జీవిత చరిత్రలపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రంతో పాటు నగదు బహుమతి అందజేశారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాలకు సంబదించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి అశోక్, జిల్లా అధికారులు, నాయకులు సుగుణక్క, శ్యామ్ నాయక్, కుల సంఘాల ప్రతినిధులు దుర్గం తుకారాం, అశోక్, కేశవరావు, అంబేద్కర్ సంఘం ప్రతినిధులు ప్రశాంత్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనతో దేశాభివృద్ధి సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, వివిధ బి. సి. సంఘాల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, ఇన్చార్జ్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, వివిధ బిసి సంఘాల నాయకులతో కలిసి హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, దళిత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డా. బి.ఆర్. అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు సదా స్మరణీయమని తెలిపారు. భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించడమే కాకుండా సమాజంలో సమానత్వం, మహిళల అభివృద్ధి, కుల, మత, వర్ణ, వర్గ ప్రాంత విభేదాలు లేకుండా దేశ పౌరులుగా అందరూ సమానమైన అని తెలుపుతూ రాజ్యాంగ రచన చేశారని, విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఆనాటి సమాజంలోని అసమానతలను ఎదుర్కొని ఉన్నత విద్యను అభ్యసించి, సమాన అవకాశాల కోసం రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. మన దేశ రాజ్యాంగం వివిధ దేశాల రాజ్యాంగాల ప్రేరణతో రూపొందించబడిందని, తద్వారా నేడు దేశ పరిపాలన సులభతరమైందని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో రాజ్యాంగం అందరికీ ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలు రాజ్యాంగం ప్రకారమే జరుగుతోందని, ప్రతి ఒక్కరికీ చదువుకునే హక్కు, స్వేచ్ఛగా జీవించే హక్కులు రాజ్యాంగం ద్వారా కల్పించబడిందని తెలిపారు. అంతకుముందు రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద మంచిర్యాల పట్టణంలోని ఐ.బి. చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. తదనంతరం మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్శి మధుకర్, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత శాఖల అధికారులు, బి.సి. సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పిసిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2వ వారం కొనసాగుతున్న మజ్జిగ పంపిణీ

జన్నారం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త

పిసిఆర్ పూర్ణచందర్రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జన్నారం మండల కేంద్రంలో రెండో వారం కూడా మంగళవారం మజ్జిగ పంపిణీ కొనసాగించారు. ఎండలు మండుతుండడంతో వార సంతకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛందంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరి కృష్ణారావు, నోముల రాజ్ కుమార్, మోలానా, పీసీఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## సమానత్వం, సామాజిక న్యాయం కోసం..

# అంబేద్కర్ ఆశయాలు మార్గదర్శకం




### కాసిపేట టూ ఇంక్లైన్ గని మేనేజర్ లక్ష్మీనారాయణ ✳ గనిపై ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

కాసిపేట, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని కాసిపేట టూ ఇంక్లైన్ గనిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గని ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గని మేనేజర్ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్మీనారాయణ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించి దేశ ప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛలు అందించారని తెలిపారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ నిరంతరం కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు.అంబేద్కర్ ఆశయాలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఆయన సూచించారు. విద్య ద్వారానే వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి సాధ్యమని, కార్మికులు తమ హక్కులు తెలుసుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందాలని అన్నారు. యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని కృషి చేస్తేనే దేశాభివృద్ధికి తోడ్పడగలరని వివరించారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు, సిబ్బంది, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా అంబేద్కర్ జీవితం, ఆయన ఆలోచనలు, సమాజంపై ఆయన చూపిన ప్రభావం గురించి చర్చించారు. అనంతరం పాల్గొన్న వారు అంబేద్కర్ ఆశయాలను అనుసరించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కృష్ణ ప్రసాద్, సేఫ్టీ ఆఫీసర్ రవిశంకర్, డిప్యూటీ మేనేజర్ దిలీప్ కుమార్, ఆయా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.









## అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

తాండూర్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :



మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు మంగళవారం సర్పంచ్ ఆకుల వెంకటేష్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా కొత్తపల్లిలో తన సొంత ఖర్చులతో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చానన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం అంబేద్కర్ జయంతి సందర్భంగా భూమి పూజ చేసి ముగ్గు పోయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, మాదారం సర్పంచ్ లక్ష్మణ్, నాయకులు, మల్లేష్, అశోక్, దేగ స్వామి , ప్రవీణ్, మొండి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

బెజ్జూర్,ఏప్రిల్ 14,ప్రభాతవార్త:



బెజ్జూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అంతేకాకుండా మండల కేంద్రంలోని బస్టాండ్ ఏరియా గుండా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.అంతేకాకుండా ముందుగా ఉదయం అంబేద్కర్ భవన్ వద్ద పంచరంగుల జెండా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి,ఉప సర్పంచ్ రాచకొండ ఆదర్శ్,పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

## అరైవ్ అండ్ అలైవ్ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

మందమర్రి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త



మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని మందమర్రి చౌరస్తా వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి వివేక్ వెంకటస్వామి, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ లు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 13 నుంచి 18 వరకు కొనసాగుతున్న అరైవ్ అండ్ అలైవ్ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ, రోడ్డు భద్రత అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలను నివారించొచ్చని, ప్రతి వాహనదారుడు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వం సురక్షితమైన ప్రయాణం కోసం రహదారులను నిర్మించినప్పటికీ, వాటిని వినియోగించే వారు క్రమశిక్షణతో, అవగాహనతో వాహనాలు నడపాలని సూచించారు. ఆటో డ్రైవర్లతోపాటు ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమం లో పాల్గొన్న ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ఆటో డ్రైవర్లు రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. "నేను భారతదేశ పౌరుడిగా మోటారు వాహన చట్టంలోని అన్ని నిబంధనలను పాటిస్తూ, ఇతరులకు అవగాహన కల్పిస్తూ, తోటి రోడ్డు వినియోగదారులను గౌరవిస్తూ, ప్రమాదాలు జరగకుండా బాధ్యతగా వ్యవహరిస్తాను అని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, మందమర్రి సిఐ పరస రమేష్ ఎస్ఐ నరేష్ ప్రజాప్రతినిధులు,యువత, ఆటో డ్రైవర్ లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**నిర్మల్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా పంచశీల జెండాను ఎగురవేసి, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రత్న కళ్యా ణి, ఇతర అధికారులు మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచం గర్వించదగ్గ గొప్ప మేధావి అని కొనియాడారు. భారత రాజ్యాంగ రచనలో ఆయన పోషించిన పాత్ర అనన్యసామాన్యమని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను మార్గదర్శకంగా తీసుకుని దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు దయానంద్, శ్రీనివాస్, సీపీఓ జీవరత్నం, తహసీల్దార్లు రాజు, ప్రభాకర్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్‌తోనే ఎమ్మెల్యే అయ్యాను: అనిల్ జాదవ్

**నేరడిగొండ, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ ఫలాల వల్లే ఈరోజు తాను ఎమ్మెల్యేగా ఉన్నానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా నేరడిగొండ మండల కేంద్రంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే, అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేల పుస్తకాలు చదివిన అంబేద్కర్, ఈ దేశ సమాజాన్ని అంతకంటే లోతుగా అధ్యయనం చేసి గొప్ప రాజ్యాంగాన్ని రచించారని కొనియాడారు. ఆనాడు బాబాసాహెబ్ రాజ్యాంగం ద్వారా ఓటు హక్కు కల్పించకపోయి ఉంటే సమాజ పరిస్థితి మరోలా ఉండేదని అభిప్రాయపడ్డారు. ప్రతి పౌరుడు తమ నాయకుడిని తామే ఎన్నుకునే గొప్ప ప్రజాస్వామ్య అవకాశాన్ని ఆయన కల్పించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

**భైంసా, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన సిద్ధాంతాలే సామాజిక న్యాయానికి పునాది అని పేర్కొన్నారు. పట్టణంలో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లతో చర్చించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. భవన నిర్మాణానికి త్వరలోనే ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తు, ఏఎంసీ చైర్మన్ ఆనంద్ రావు పాటిల్, ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పాటిల్, సాయిలు, శంకర్ చంద్రే, భీమ్ రావ్ దొంగ్రే, పి. వెంకటరమణ, తాలోడ్ శ్రీనివాస్, రాహుల్, రాము తదితరులు పాల్గొన్నారు.

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

మండలంలోని పలు గ్రామాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరై, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువత విద్యావంతులై బాబాసాహెబ్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఇదే క్రమంలో అంబేద్కర్ విగ్రహ గద్దె నిర్మాణం కోసం రూ. 5 లక్షలు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్కే పాండురంగ్, నాయకులు భూమన్న, విఠల్, ఎస్. పాండురంగ్, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

**సారంగాపూర్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

మండలంలోని అన్ని గ్రామాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. జ్ఞానం అనేది ప్రతి ఒక్కరి ఆయుధమని, చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి సమాజంలోని అసమానతలను తొలగించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ ప్రతిఫలాలు ప్రతి పౌరుడికి అంది అందరూ ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నదే బాబాసాహెబ్ ఆశయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

మండలంలోని అన్ని గ్రామాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. జ్ఞానం అనేది ప్రతి ఒక్కరి ఆయుధమని, చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి సమాజంలోని అసమానతలను తొలగించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ ప్రతిఫలాలు అందరికీ అంది, అందరూ ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నదే బాబాసాహెబ్ ఆశయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**నర్సాపూర్ (జి), ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి ప్రసంగించారు. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలు, మహిళల సాధికారత కోసం బాబాసాహెబ్ నిరంతరం కృషి చేశారని వారు కొనియాడారు. దేశ భవిష్యత్తును ముందుగానే ఊహించి, దార్శనికతతో ఆయన రూపొందించిన రాజ్యాంగం భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే విలువలను అందించిన అంబేద్కర్ మార్గం సమాజానికి ఎల్లప్పుడూ దిశానిర్దేశం చేస్తుందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా అందరికీ సమాన అవకాశాలు కల్పించే సమాజ నిర్మాణం కోసం అందరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇంద్రకరణ్ రెడ్డి, ఉపసర్పంచ్ ప్రభాకర్, బీజేపీ మండల అధ్యక్షుడు బర్కుంట నరేందర్, నాయకులు రమేష్, రాంరెడ్డి, రామయ్య, రాజేందర్, దత్తురాం, భూమన్న, మధు, కమలాకర్, రవీందర్, శ్యామ్, అశోక్, రఘు తదితరులు పాల్గొన్నారు.

**భైంసా, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్ హేమ్లే పేర్కొన్నారు. భైంసా పట్టణంలోని వివిధ కాలనీల్లో బి.ఎస్.ఐ, సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో బాబాసాహెబ్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచశీల, నీలి జెండాలను ఎగురవేసి, గౌతమ బుద్ధునితో పాటు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం ప్రశాంత్ హేమ్లే మాట్లాడుతూ.. అంబేద్కర్ తన జీవితాంతం బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, దేశాభివృద్ధి కోసం నిరంతరం పోరాడారని కొనియాడారు. రాజ్యాంగం ద్వారా అందరికీ స్వేచ్ఛ, సమానత్వం కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని గుర్తు చేశారు. నేటి యువత బాబాసాహెబ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఆయన చూపిన మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.ఐ ప్రతినిధులు దమ్మనంద్ దేవ్కే, నారాయణ్ దుగ్గే, రోహిత్, కునాల్, అశ్వజిత్, ఆకాష్, దేవ కిరణ్, అక్షయ్ గాయక్వాడ్, భగవాన్ సల్వే, గంగాధర్ వాగ్మారే, బౌద్ధ దమ్మ అభిమానులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నిర్మల్ ఆర్డీఓ రత్న కళ్యాణి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్



నివాళులర్పిస్తున్న సర్పంచ్ ఇంద్రకరణ్ రెడ్డి







# ఘనంగా బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

**నస్పూర్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మంచిర్యాల జిల్లాలో మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. వివిధ రాజకీయ పార్టీలు, సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో నాయకులు అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నివాళి

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాత మంచిర్యాలలో ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన సందర్భంగా ఐఎంఏ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్యమహేష్, డీసీపీ భాస్కర్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

### శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో వేడుకలు

శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం మునిగంటి శ్రీనివాస్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, విద్యార్థుల కోసం నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అంబేద్కర్ ఒక గొప్ప సంఘ సంస్కర్త అని, ఆయన రూపొందించిన రాజ్యాంగం వల్లనే సమాజంలో అందరికీ సమాన హక్కులు, సామాజిక న్యాయం సాధ్యమయ్యాయని జీఎం కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా, ఉద్యోగుల సంఘం బ్రాంచి అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్సీ లైజన్ ఆఫీసర్ ఆనంద్ కుమార్, డీజీఎంలు రాజన్న, డీజీఎం అనిల్ కుమార్, ఎస్టీ లైజన్ ఆఫీసర్ గుండే రావు, సీనీయర్ పీఓ సురేందర్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు

### బీజేపీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల సన్మానం

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఐబీ చౌరస్తాలో నివాళులర్పించారు. అనంతరం ఏకలవ్య ఆశ్రమంలో పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి, నూతన వస్త్రాలతో వారిని ఘనంగా సన్మానించారు. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్మికులను గౌరవించడం సంతోషంగా ఉందని, వారి ఆరోగ్యాన్ని పణంగా పెట్టి సేవలు అందిస్తున్నారని వారు పేర్కొన్నారు.

### బీఆర్ఎస్ పార్టీ నివాళులు

నస్పూర్ పట్టణంలోని సీసీసీ కార్నర్ వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ రావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బన్న, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు బండి రమేష్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని వారు పిలుపునిచ్చారు.

### ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో..

ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలో జయంతి వేడుకలు నిర్వహించారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం అంబేద్కర్ చేసిన పోరాటం దేశ చరిత్రలో చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. యువత అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజ నిర్మాణంలో ముందుకు రావాలని, కార్మికుల హక్కుల పరిరక్షణలో ఆయన సిద్ధాంతాలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరిగె స్వామి, శ్రీనివాస్, ప్రవీణ్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### హెచ్ఎంఎస్ సంఘం వేడుకలు

సీసీసీ హెచ్ఎంఎస్ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యానికి పునాదులు వేసిన మేధావి అంబేద్కర్ అని ఆయన స్మరించుకున్నారు. ఈ వేడుకల్లో బ్రాంచ్ సెక్రటరీ పొనగంటి అశోక్, ఇతర నాయకులు పాల్గొని స్వీట్లు పంపిణీ చేశారు.

### బిఎంఎస్ కార్యాలయం వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు


అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

శ్రీరాంపూర్ ఏరియా బిఎంఎస్ కార్యాలయం వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాతాడి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ భారతీయుల గుండెల్లో నిలిచిపోయే మహనీయుడని కొనియాడారు. ఆయన ఆర్థికవేత్తగా, రాజ్యాంగ నిర్మాతగా, గొప్ప సామాజిక సంస్కర్తగా దేశానికి ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ దళితులు, మహిళలు మరియు కార్మికుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పబ్బతినేని కమలాకర్ రావు, జాయింట్ సెక్రటరీలు భూంపల్లి రమేష్, మల్లయ్య, శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపతి పాల్గొన్నారు.


జీఎం కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకల్లో జీఎం, ఇతర అధికారులు

### శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో నివాళి

శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్ వద్ద డీజీఎం బి. రవీందర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాత సేవలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ సదానందం, డీవైఎస్ఈలు అజ్మీరా భీమా, మధుకర్, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**వేమనపల్లి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

వేమనపల్లి మండల కేంద్రం బస్టాండ్ ఆవరణలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు వేమనపల్లి మండల నేతకాని మహర్ సేవా సంఘం మండల అధ్యక్షులు కామెర గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఈ దేశానికి చేసిన సేవలు వెలకట్టలేనివని ఆ మహానుభావుని గురించి ఎంత చెప్పినా తక్కువేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సాయికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు కుడుకల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు పెరుగు దాసు, నాయకులు జాడి గోపాల్, సుంపుటం సర్పంచ్ దుర్గం భాగ్య లక్ష్మి తిరుపతి, ఉప సర్పంచ్ దందేర మహేష్, మాజి సర్పంచ్ తోకల రామచెందర్, కొండగొర్ల బాపు, తదితరులు పాల్గొన్నారు.

**వేమనపల్లి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

నీల్వాయి బస్టాండ్ సమీపంలో సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇట్టి జయంతి వేడుకలకు మాజీ జడ్పీటీసీ ఆర్ సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ, డిసీసీ జనరల్ సెక్రటరీ గాలి మధు, నీల్వాయి ఎస్సై జగదీష్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, అణగారిన వర్గాల ప్రజల కోసం పోరాటం చేసి హక్కులు సాధించిన గొప్ప నాయకుడు అంబేద్కర్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం నాటి ప్రభుత్వాలతో పోరాడిన పోరాట పటిమ కలిగిన గొప్ప నేత, మహిళ కోసం హిందూ కోడ్ బిల్లును తీసుకొని వచ్చి పార్లమెంటులో బిల్లు నెగ్గకపోతే మహిళల కోసం తన న్యాయ శాఖ పదవిని సైతం లెక్క చేయకుండా రాజీనామా చేసిన వ్యక్తి డా బిఆర్ అంబేద్కర్ అని ఈరోజు ఈ దేశమే కాదు ప్రపంచ దేశాలు సైతం అంబేద్కర్ జన్మదినాన్ని ప్రపంచ ప్రపంచ జ్ఞాన దినోత్సవంగా జరుపుకుంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌లు వుప్పులపు సాయికృష్ణ, అవులమారి పున్నం, దుర్గం భాగ్యలక్ష్మి తిరుపతి, ఆకుల లింగగౌడ్, ఒడిల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలో తెలంగాణ దళిత సంఘాల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ శిల్పి, మహనీయ సామాజిక సంస్కర్త డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పట్టణం అంతటా పండుగ వాతావరణం నెలకొంది. దళిత సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పంచశీల జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి అక్కడికి వచ్చిన ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన మార్గం సమాజానికి వెలుగునిచ్చే మార్గమని, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్, వైస్ చైర్మన్ రాగం శెట్టి సతీష్, స్టేట్ ఎస్సీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, మంచిర్యాల జిల్లా ఎస్సీ మానిటరింగ్ కమిటీ సభ్యులు చిలుక రాజనర్సు పాల్గొని అంబేద్కర్ సేవలను కొనియాడారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ సిద్ధాంతాలు సమాజంలో మార్పుకు పునాది అని, దళితుల అభ్యున్నతికి ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. అలాగే దళిత సంఘాల ఐక్యవేదిక బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కుంభాల రాజేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ప్రధాన కార్యదర్శి రత్నం ఐలయ్య, కోశాధికారి గొడిసెల శ్రీహరి, ముఖ్య సలహాదారులు మల్లారపు చినరాజం, రాష్ట్ర టిపిసిసి జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, ఎల్తురి శంకర్ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ఉపాధ్యక్షులు కుష్ణపెల్లి రాయలింగు, కామెర దుర్గయ్య, పైడిమల్ల చంద్రశేఖర్, గొడిసెల చంద్ర మోగిలి, కార్యదర్శులు నాతరి కిరణ్, గీసరాజేశం, అంగూరి సుభాష్, పట్టి నవీన్ తదితరులు చురుకుగా పాల్గొన్నారు. గౌరవ సభ్యులు కాసర్ల యాదగిరి, కొమ్ము అనసూర్య, దాసరి భానయ్య, మిట్టపెల్లి మల్లయ్య, బొంకురి రాంచందర్, సబ్బాని రాజనర్సు, ఎలుక ఆకాష్, గోగర్ల శేఖర్, పాముల రాజలింగు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు, యువకులు, మహిళలు ఈ కార్యక్రమానికి హాజరై అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు.






అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ శ్రేణులు


పారిశుద్ధ్య కార్మికుల కాళ్లు కడుగుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్


వేమనపల్లి మహార్ సేవా సంఘం ఆధ్వర్యంలో..







# అంబేద్కర్ అంటే ఒక స్ఫూర్తి..

*** ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు**

*** ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి వివేక్**

**మందమరి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలో ఘనంగా డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ పట్టణ యువజన సంఘం, సింగరేణి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా కార్మిక, ఉపాధి గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ పాటు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, డీసీపీ ఏ.భాస్కర్, జీఎం ఎన్ రాధాకృష్ణ హాజరయ్యారు. ముందుగా మార్కెట్లోని సింగరేణి పాఠశాల వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి వివేక్ పంచశీల పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో గ్రీన్ పార్క్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి జై భీమ్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ... సింగరేణిలో దళిత సామాజిక వర్గానికి చెందిన కార్మికులు చాలా మంది ఉన్నారు. అందరికీ అంబేద్కర్ అంటే ఒక స్ఫూర్తి. చిన్నతనంలో స్కూల్ నుంచి వెలివేసిన కుల వివక్ష ఉన్నపటికీ అంబేద్కర్ కృషి, పట్టుదలతో చదివి ఆ రోజులో 23 డిగ్రీలు పూర్తి చేశాడు అంటే మామూలు విషయం కాదన్నారు. అంబేద్కర్ లండన్ లో చదివి భారతదేశపు నుండి ఎకనామిక్స్లో ఉత్తీర్ణత సాధించారు. అంబేద్కర్ స్ఫూర్తితోనే కార్మికులకు పెన్షన్ పథకం, ప్రాఫిట్ ఫండ్ వంటివి తీసుకొని వచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అంబేద్కర్ స్ఫూర్తితో అందరూ చదవాలని 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ యంగ్ స్కూల్స్ స్థాపన చేయడం మొదలుపెట్టారు. బడ్జెట్ లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ కోసం 500 కోట్లు ప్రవేశ పెట్టారన్నారు. విద్య రంగంలో యాభై వేల మంది టీచర్లను భర్తీ చేశారంటే విద్యకు ఎంత ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుందో కదా అన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ఒక వ్యక్తి కాదు ఒక రెవల్యూషన్ అన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో మనందరం ముందుకు వెళ్ళాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సతీష్ కుమార్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అంబేద్కర్ యువజన సంఘాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల సంఘాలు పాల్గొన్నాయి. బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సీఐ రమేష్, ఎస్సై లు గోపతి నరేష్, జాడి శ్రీధర్ బందోబస్తు నిర్వహించారు.







**జన్నారం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

యువత అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని పొనకల్ గ్రామ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకల సందర్భంగా పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను రూపుమాపి, అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ కృషి చేశారని కొనియాడారు. అందరికీ విద్య, సమానత్వం, స్వేచ్ఛ కల్పించాలన్నదే ఆయన ఆశయమని అన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం వల్లే నేడు మనం హక్కులతో జీవిస్తున్నాం అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఈ వో రాహూల్, పొనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, ఉప సర్పంచ్ అప్పాల జలపతి, వార్డు మెంబర్లు మోసిన్ షా ఖాన్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి నరసయ్య కోరారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కౌన్సిలర్లు, అధికారులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసే నివాళులర్పించారు. ఈ సందర్భంగా తన మాట్లాడుతూ.. అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్తగా సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహా నేత అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టి సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు ఉన్నారు.

**బెల్లంపల్లి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత, దళితుల ఆశాజ్యోతి, ప్రపంచ మేధావి డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు దుర్గం లక్ష్మి, జిల్లా కార్యదర్శి కామెర పద్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో దుర్గం లక్ష్మి మాట్లాడుతూ, అంబేద్కర్ తన జీవితాన్ని దళితుల అభ్యున్నతి కోసం అంకితం చేశారని తెలిపారు. సమాజంలో ఉన్న అసమానతలను, మనుధర్మాన్ని నిర్మూలించేందుకు ఆయన అనేక పోరాటాలు నిర్వహించారని పేర్కొన్నారు. రాజ్యాంగంలో దళితులు, బహుజనులకు హక్కులు కల్పించడంలో అంబేద్కర్ పాత్ర అపారమని, విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎదగడానికి ఆయన మార్గం సుగమం చేశారని చెప్పారు. గుడి మెట్లు, బడి మెట్లు ఎక్కే అవకాశాన్ని కల్పించి సమాన హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఈ దేశంలో ప్రతి మనిషికి సమాన హక్కులు అందాలని, అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో అంబేద్కర్ అహర్నిశలు కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన కలలుగన్న బహుజన సమాజ నిర్మాణం కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే లాల్ జెండా, నీల్ జెండాలను ఏకం చేసి మార్క్సిజం, అంబేద్కర్ ఆలోచన విధానాలను అమలు చేస్తేనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. యువత అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) పార్టీ నాయకులు సంతోష్ తదితరులు పాల్గొని అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు.

**మందమర్రి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం మందమర్రి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలోని సింగరేణి హైస్కూల్ ముందు ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సంఘం పట్టణ అధ్యక్షులు సకినాల శంకర్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా, సామాజిక న్యాయానికి మార్గదర్శిగా డా. అంబేద్కర్ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ నేరెళ్ల వెంకటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి బత్తుల సతీష్, గౌరవ అధ్యక్షులు పోలు శ్రీనివాస్, బొలిశెట్టి రాజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బేర వేణుగోపాలరావు, వైస్ ప్రెసిడెంట్ దేవులపల్లి ప్రభాకర్, పారుపల్లి శివరామకృష్ణ, ప్రచార కార్యదర్శి నర్సోజి, సత్యనారాయణ, పోలు సంపత్, పోలు కుమార్, గట్ల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

**జన్నారం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

అంబేద్కర్ ఆశయ సాధనలతో యువత ముందుకు నడవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానం నేటి యువతకు ఆదర్శప్రాయమని, ఆయన ఆశయాల కనుగుణంగా యువత ముందుకు సాగాలని కోరారు .అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 15వ జయంతి సందర్భంగా జన్నారం మండలంలోని మొర్రిగూడ ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన నూతన అంబేద్కర్ విగ్రహాన్ని మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబాసాహెబ్ కృషి వల్లనే నేడు బడుగు బలహీన వర్గాలు రిజర్వేషన్ ఫలాలు పొందుతూ, ఉన్నత స్థాయిలో ఉన్నారని,సమాజంలో గౌరవం పొందుతున్నాం అని,నేటి సమాజంలో చదువుతోనే యువతకు భవిష్యత్ అన్నారు. ప్రతి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ముఖ్య ఉద్దేశం సమాజంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే అంబేద్కర్ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని కష్టపడి చదువుకోవాలన్నారు. దేశంలో భారత రాజ్యాంగ రక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం,బిజెపి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన రాజ్యాంగాన్ని నీరుగార్చలేరని అన్నారు. మనం అనుభవిస్తున్న ప్రతి పదవి,మన ఫలాలు,అనుభవిస్తున్న రిజర్వేషన్లు అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపెల్లి విజయ లచ్చన్న,మార్కెట్ కమిటీ అధ్యక్షుడు దుర్గం లక్ష్మీనారాయణ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు భరత్ కుమార్,మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్ర శేఖర్, సుధాకర్ నాయక్, మామిడిపెల్లి ఇందయ్య,రమేష్ స్థానిక గ్రామస్తులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

**చెన్నూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన ఉందని తెలంగాణ మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద అంబేద్కర్ ఉత్సవ సమితి సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ 135 వ జయంతి వేడుకల్లో మంత్రి వివేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ పాలన సాగిస్తోందని అన్నారు. మంత్రి వివేక్ ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసారని అన్నారు. దేశంలో స్వపరిపాలన కోసం స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. బడుగు బలహీనర్గాలకు న్యాయం చేకూర్చేలా ఆయన రాజ్యాంగాన్ని రచించి బహుజనులకు దేవుడయ్యాడని పేర్కొన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో "అలైవ్ అరైవ్" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతా ప్రమాణం చేయించారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని ప్రయాణ సమయంలో ముఖ్యంగా డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# డాక్టర్ భీమ్రావు అంబేద్కర్‌కు ఘన నివాళులు


ఐబిలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకలలో పాల్గొన్న నాయకులు

**కెరమెరి,ఏప్రిల్ 14, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం 135వ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి నీఘనంగా నిర్వహించారు ముందుగా తాసిల్దార్ సంతోష్ కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల వారికి ఆర్థిక, సామాజిక,న్యాయ, రాజకీయ రంగాలలో సమన్యాయం జరగాలని ఆకాంక్షించిన ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని కొనియాడారు. భారత రాజ్యాంగ రూపకర్త సమాజంలోని అణగారిన వర్గాల అభివృద్ధి కోసం అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శవంత, ఆర్ ఐ పవన్ నాయక్ జూనియర్ అసిస్టెంట్ రమేష్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**తాండూర్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం, ఐబి, తాండూర్, ఎంవికే3 ఇంక్లైన్, కొత్తపల్లి, అచ్చలాపూర్ తదితర గ్రామాల్లో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో అంబేద్కర్ మండల కమిటీ అధ్యక్షుడు జాడిపోశం, డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ పేరం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కామని శ్రీనివాస్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బోడ సతీష్, సర్పంచులు కుశ్నపల్లి లక్ష్ముుు ్మణ్, దర్శనాల రవికుమార్, మారిశెట్టి స్రవంతి, సార్ల తిరుపతి, నాయకులు ఎండి ఈసా, ఎలుక రాంచందర్, మామిడాల రాజేశం, పులుగం తిరుపతి, శ్రీకృష్ణదేవరాయలు, తదితరులు పాల్గొన్నారు.

**లింగాపూర్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :**

లింగాపూర్ మండల కేంద్రంలో డాక్టర్ భీమ్రావు అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్, రమాబాయి మహిళ మండల్ అసోసియేషన్, అంబేద్కర్ అభిమానులు ,నాయకులు అందరూ కలిసి డాక్టర్ భీమ్రావు అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి చేసిన సేవలను, భారత రాజ్యాంగం నిర్మించిన విధానాన్ని స్మరించుకుంటూ ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాదవ్ రాజశేఖర్, మాజీ జడ్పిటిసి లక్యానాయక్, రాథోడ్ రమేష్, దళిత సంఘాల నాయకులు, ఎస్పై గంగన్న, అంబేద్కర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు గనులు, కార్యాలయాల్లో..

**తాండూర్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :**

బెల్లంపల్లి ఏరియాలోని జిఎం కార్యాలయం ఆవరణలో, ఖైరిగుర ఓసి, గోలేటి సిహెచ్పి, వర్క్ షాప్, స్టోర్స్, ఏజెంట్ ఆఫీస్, ఎంవిటిసి కార్యాలయాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి, చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏరియా జిఎం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ పాత్ర ఎంతో కీలకమని, వారి ప్రతిభను ప్రపంచం అంతా గుర్తించిందన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా బొగ్గు పరిశ్రమ ఉద్యోగులు దేశ అభివృద్ధిలో తమవంతుగా కృషి చేయాలన్నారు. మహనీయులు మనకు రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకొని భాద్యతగా వ్యవహరించాలని అన్నారు. అనంతరం అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృుృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏరియా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, సేవా సమితి అధ్యక్షురాలు పద్మా విజయ భాస్కర రెడ్డి, సీఎంఓ ఏఐ ఏరియా అధ్యక్షులు మచ్చగిరి నరేందర్,ఏరియా ఇంజినీర్ జి కృష్ణ మూర్తి, ఇంచార్జి ఎస్ ఓ టు జిఎం ఉమాకాంత్, పర్సనల్ హెచ్ ఓ డి రాజేశ్వర్ రావు, ఎస్సీ లైసన్ ఆఫీసర్ డి ప్రశాంత్ , ఇంచార్జి ఎస్టి లైసన్ శంకర్, ఎస్సీ యూనియన్ ప్రతినిధులు అంబేద్కర్, రాజబాబు, ఎస్టి యూనియన్ మెంబర్స్ వీరన్న, మంగిలాల్, తదితరులు పాల్గొన్నారు.

**వాంకిడి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :**

వాంకిడి మండల బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు మాజీ జెడ్పిటిసి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల కోసం,అంటరానితనం నిర్మూలన, భారత రాజ్యాంగ నిర్మాత,ప్రపంచ మేధావి, అని కొనియాడారు కార్యక్రమంలో సింగల్ విండో మాజీ చైర్మన్ జాబోరే పెంటు వాంకిడి గ్రామ సర్పంచ్ చునర్కర్ సతీష్ యూత్ మండల అధ్యక్షుడు రాకేష్ సంతోష్ శీను సాయినాథ్ కపిల్ మోను అంకిత్ తదితరులు పాల్గొన్నారు

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :**

విశ్వ మేధావి, భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 135వ జయంతి ఉత్సవాలను సమత సొసైటీ కాగజ్‌నగర్, ది బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాగజ్‌నగర్ మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అనిత శ్రీనివాస్ హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డాక్టర్ అంబేద్కర్ ఒక కులానికో, మతానికో, వర్గానికో చెందిన వ్యక్తి కాదని, దేశంలోని అన్ని వర్గాల ప్రజల కోసం, ముఖ్యంగా మహిళల సాధికారత కోసం కృషి చేసిన మహానీయుడని పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ కలలు కన్న కులరహిత, వర్గరహిత సమసమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సమత సొసైటీ అధ్యక్షులు దుర్గం జనార్ధన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ది బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం విస్తారు, సమత సొసైటీ ప్రధాన కార్యదర్శి తిరుపతి, బీఎస్ఐ సీనియర్ నాయకులు విశ్వాస్ జగతాప్, రమేష్ డోంగ్రే, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యకర్తలు, సమత సొసైటీ సభ్యులు, మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని మహనీయునికి నివాళులు అర్పించారు.

**చింతలమనేపల్లి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త;**

మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను భారతీయ జనతా పార్టీ (బిజెపి) శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి బిజెపి మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని, ఆయన కల్పించిన రాజ్యాంగ ఫలాలు నేడు అందరికీ అందుతున్నాయని కొనియాడారు. కులమతాలకు అతీతంగా సమాజాన్ని ఏకం చేసేందుకు ఆయన పడిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**పెంచికల్ పేట్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :**

అంబేద్కర్ ఆశయాసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బహుజన సంఘాల నాయకులు అన్నారు. సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో నీలి జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాలకు హక్కులు కల్పించిన, రాజ్యాంగ ప్రధాత అంబేద్కర్ అని, ఆయన అడుగుజాడల్లో నడుచుకుంటూ అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలని అన్నారు. అనంతరం పెంచికల్ పేట్, ఎల్లూర్, ఎల్కపల్లి గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని ప్రధాన విధులగుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు భక్తు రాంచంధర్, ఉస్మాన్ లతో పాటు బహుజన సంఘాల నాయకులు మహిళలు యువకులు పాల్గొన్నారు.




నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ అభిమానులు నాయకులు


గోలేటి జిఎం కార్యాలయంలో..




కాగజ్‌నగర్‌లో..


నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు


ర్యాలీలో పాల్గొన్న బహుజనులు





అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అధికారులు, సిబ్బంది

# అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

**నిర్మల్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని నిర్మల్ జిల్లా కేంద్రంలోని ట్యాంక్ బండ్ వద్ద గల ఆయన విగ్రహానికి బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబాసాహెబ్ దేశానికి, సమాజానికి చేసిన సేవలను ఆయన గుర్తుచేసుకున్నారు. అనంతరం రాంనాథ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. హిందూ ధర్మ పరిరక్షణకు సైతం ఆయన విశేషంగా శ్రమించారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయ సాధనకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మెడిసమ్మె రాజు, ఆకుల కార్తీక్, సాధం అరవింద్, శ్రీరామోజీ నరేష్, కూన శశాంక్, సుంకరి సాయి, కృష్ణమోహన్, ముత్యం, ఈశ్వర్, సూరజ్ నాయక్, విఠల్, పొన్నం నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలం ఎంపీడీవో కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది పాల్గొని అంబేద్కర్ ఆలోచనలు, సమాజానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీఓ గౌరీ శంకర్, డీఎల్‌పీఓ హరిప్రసాద్, ఏపీఓ చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ సోహెబ్, అటెండర్లు డోంగ్రి కిషన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన వారు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమాజంలో సమానత్వం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొల్కె లక్ష్ముబ్బాయి మొక్క, గ్రామపంచాయతీ కార్యదర్శి కుమ్మరి హరీష్, ఉప సర్పంచ్ ఆత్రం ఆకాష్, మాజీ ఎంపీటీసీ నికూరె నాగేందర్, మాజీ సర్పంచ్ ఆత్రం సంజీవ్, వార్డ్ మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**నిర్మల్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరిరావు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ రూపకర్తగా సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ జీవితాంతం పోరాడారని కొనియాడారు. దళిత, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని బాబాసాహెబ్ ఇచ్చిన సందేశం నేటికీ ఆచరణీయమని తెలిపారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వ సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభా ప్రాంగణం జై భీమ్ నినాదాలతో మార్మోగింది.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సర్పంచ్, తదితరులు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్

## బావిలో పడి వృద్ధుడు మృతి

**బెజ్జూర్,ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**




బెజ్జూర్ మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన మెరుగు రామయ్య (70) అనే వృద్ధుడు ఈనెల 13వ తేదీ బావిలో పడి మృతి చెందాడు.స్థానికుల వివరాల ప్రకారం మృతునికి రైతు బంధు పథకంలో 6వేలు ఖాతాలో జమ కావడంతో గత కొన్ని రోజులుగా ఆ డబ్బులు తీసుకొని మద్యం సేవిస్తూ లోడుపల్లి గ్రామానికి చెందిన అతని చెల్లెలు జాజిమొగ్గ ఈశ్వరి ఇంటికి వెళ్ళాడని తెలిపారు. అక్కడ సుమారు వారం రోజుల పాటు ఉండి ఈనెల 11వ తేదీన తిరిగి ఇంటికి బయలుదేరాడు.ఈనెల 13వ తేదీ సోమవారం సాయంత్రం కాటేపల్లి గ్రామ శివారులోని ఆత్రం దామోదర్ వరి చేనులో ఉన్న బావిలో రామయ్య మృతదేహం కనిపించడంతో సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించారు.గతంలో కూడా మృతుడు ఇలాంటి ఎన్నో సందర్భాల్లో ఇంటి నుండి వెళ్లి కొన్ని రోజులపాటు ఉండేవాడని కుటుంబీకులు తెలిపారు.మద్యం మత్తులో బావిలో పడిపోవడం వల్లే మృతి చెంది ఉండవచ్చు అని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.ఇట్టి ఘటనపై మృతుని భార్య గంగక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సర్తాజ్ పాషా తెలిపారు.

## అగ్నిమాపక సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సురేష్ కుమార్**

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :**



అగ్నిమాపక సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సురేష్ కుమార్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అగ్నిమాపక సిబ్బంది ధైర్యసాహసాలు, త్యాగాలు గుర్తుచేసుకునేందుకు ఈ వారోత్సవాలు ఉపయోగపడతాయన్నారు. అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలతో పాటు రోడ్డు ప్రమాదాలు, భూకంపాలు, వరదలు ఇతర అత్యవసర పరిస్థితుల్లో కూడా ప్రజల ప్రాణాలు రక్షించడానికి ముందుంటారన్నారు. ఇంట్లో ప్రమాదాలు జరగకుండా తీసుకువాల్సిన జాగ్రత్తలు, ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించడం, చిన్నపాటి జాగ్రత్తలతో పెద్ద ప్రమాదాలను ఎలా నివారించవచ్చు అనే అంశాలపై వివరించనున్నట్లు తెలిపారు. అగ్ని మాపక దినోత్సవంతో పాటు ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక భద్రతా వారోత్సవం నిర్వహించడం ప్రత్యేకమని, ఈ వారం రోజుల పాటు పాఠశాలలు, కార్యాలయాలు, రద్దీ ప్రదేశాల్లో, పరిశ్రమల్లో మాక్ డ్రిల్స్, ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవి 20 న ముగింపు రోజు సందర్భంగా వ్యాసరచన పోటీలు, చిత్రకళ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి తెలిపారు.

## మైనారిటీ సోదరుల ఆధ్వర్యంలో పండ్లు, మంచినీరు పంపిణీ

**పెంచికల్ పేట్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో మతసామరస్యానికి నిదర్శనంగా మైనార్టీ సోదరులు సేవా కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న బహుజన సోదరులకు పండ్లు, మంచినీరు పంపిణీ చేస్తూ తమ సహృదయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం, పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. భిన్న మతాల మధ్య పరస్పర గౌరవం, స్నేహభావం అవసరమని అన్నారు, ఈ కార్యక్రమంలో పెంచికల్ పేట్ సర్పంచ్ షేక్ ఉస్మాన్, నాయకులు సాజీత్, ముంతాజ్, మజీద్, యువకులు తదితరులు పాల్గొన్నారు.



పండ్లు, మంచినీరు పంపిణీ చేస్తున్న మైనార్టీ సోదరులు

# ప్రతి పౌరుడు అగ్నిమాపక భద్రతా నియమాలను పాటించాలి

**ఆసిఫాబాద్ టౌన్ , ఏప్రిల్ 14, ప్రభాతవార్త :**



అగ్ని మాపక శాఖ అధికారులను సన్మానిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

ప్రతి పౌరుడు అగ్నిమాపక భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని వాసవి క్లబ్ అధ్యక్షుడు మర్యాల ఉదయ్ బాబు, జిల్లా అగ్నిమపక శాఖ అధికారి సురేష్ కుమార్ పేర్కొన్నారు. జాతీయ అగ్నిమాపక దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా అగ్ని మాపక శాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులకు, సిబ్బందికి శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ అగ్ని మాపక సిబ్బంది చేసిన త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా అగ్ని ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంచడం ప్రధాన లక్ష్యమన్నారు. అదేవిధంగా అగ్నిమాపక దినోత్సవం కేవలం ఒక జ్ఞాపక దినం మాత్రమే కాదని ప్రాణాలు, ఆస్తులను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది పాత్ర ఎంత గొప్పదో గుర్తు చేసే రోజని వివరించారు. అనంతరం జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14న ముంబై నౌకాశ్రయంలోని విక్టోరియా డాక్ వద్ద నిలిచిన ఎస్ఎస్ ఫోర్ట్ స్టికైన్ నౌకలో భారీ పేలుడు సంభవించిందని, ఆ మంటలను అదుపు చేయడానికి ప్రాణాలను పణంగా పెట్టిన 66 మంది అగ్నిమాపక సిబ్బంది వీరమరణం పొందారని వారి త్యాగస్ఫూర్తికి నివాళిగా అగ్నిమాపక దినోత్సవంగా పాటిస్తున్నారన్నారు. ఇళ్లలో, కార్యాలయాల్లో, పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీధర్, శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రహదారి నిబంధనలు ప్రతీ ఒక్కరు పాటిస్తూ గమ్యస్థానాలకు చేరుకోవాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త :**

రహదారి భద్రతా నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అరైవ్ అలైవ్ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి. అహ్మద్, జిల్లా రవాణా అధికారి రామచందర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ప్రజలు చైతన్యవంతులైతే రోడ్డు భద్రత సాధ్యమని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని కారణంగా అనేక ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రహదారి ప్రమాదం జరిగినట్లయితే క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకోవాలని, ప్రాణదాతలుగా నిలవాలని తెలిపారు. గోల్డెన్ అవర్ లో వారిని ఆసుపత్రికి తరలిస్తే రహవీర్ పథకం ద్వారా 25 వేల రూపాయల నగదు పురస్కారం అందించడం జరుగుతుందని తెలిపారు. ఆసిఫాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని తెలిపారు. రహదారి నిబంధనలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా ప్రమాదాలు జరిగినప్పుడు తలకు అయ్యే బలమైన గాయాలను వాటర్ మిలన్ లో ట్రయల్ చేసి ప్రదర్శించారు. అనంతరం రహదారి భద్రతపై అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హరిత




గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై శ్రీకాంత్

## రోడ్డు భద్రతపై అవగాహన

**సారంగాపూర్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల (బి) గ్రామంలో ఎస్పీ ఆదేశాల మేరకు అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఎస్సై శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు విధిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని కోరుతూ గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నిబంధనలు పాటించడం ద్వారానే ప్రాణ రక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాములు, సిబ్బంది ప్రణీత్ రెడ్డి, ఇక్బాల్, గ్రామ సర్పంచ్ బల్లురి అజయ్, మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు ఇప్ప శ్రీకాంత్ రెడ్డి, వార్డు సభ్యులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఊరేగింపు నిర్వహిస్తున్న నాయకపోడ్ కులస్తులు

## ఘనంగా భీమన్న దేవుని ఊరేగింపు

**సారంగాపూర్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల (బి) గ్రామంలో నాయకపోడ్ కులస్తులు తమ ఆరాధ్య దైవమైన భీమన్న దేవుని పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమన్న దేవుడిని గ్రామంలో వైభవంగా ఊరేగించారు. అనంతరం అడవిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకపోడ్ కుల సంఘం అధ్యక్షుడు దాసరి గణేష్, కుల సంఘ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాల గోడప్రతులు ఆవిష్కరణ

**నిర్మల్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాల గోడప్రతులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ వారోత్సవాలను ప్రణాళికాబద్ధంగా జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాల నివారణలో ముందస్తు జాగ్రత్తలు పాటించడం ఎంతో కీలకమని తెలిపారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలు, షాపింగ్ కాంప్లెక్స్ లు, పెట్రోల్ బంకుల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక డెమోలు, శిక్షణ శిబిరాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో సిబ్బంది వెంటనే స్పందించేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి ప్రభాకర్, అధికారులు శివాజీ, సిబ్బంది పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనులను పరిశీలించిన సర్పంచ్

**వేమనపల్లి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం గ్రామ సర్పంచ్ కళ్యాణి సుధాకర్ పరిశీలించారు. ముఖ్యంగా పని స్థలాల్లో కూలీలకు ఎండ వేడి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని 9:30 వరకు ఫోటో తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. అలాగే త్రాగు నీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. అనంతరం ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్రి రమేష్, బిఆర్ఎస్ యూత్ లీడర్ దున్న పవన్, ఫీల్డ్ అసిస్టెంట్ అబ్బాగౌడ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.






## కీ.శే. ఆర్. నారాయణరావు జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు

**వేమనపల్లి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు మాజీ జడ్పీటీసీ ఆర్ సంతోష్ కుమార్ అన్నారు. నీల్వాయి బస్టాండ్ సమీపంలో మంగళవారం తన తండ్రి స్వర్గీయ ఆర్. నారాయణ రావు జ్ఞాపకార్థం చల్లని మినరల్ వాటర్‌తో చలివేంద్రంను మాజీ జడ్పీటీసీ సభ్యులు ఆర్. సంతోష్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ డీసీసీ జనరల్ సెక్రటరీ గాలి మధు, మండల సర్పంచ్ లు వుప్పులపు సాయికృష్ణ, ఆవులమారి పున్నం, కొట్రంగి శ్రీనివాస్, దుర్గం భాగ్య లక్ష్మి తిరుపతి, ఉప సర్పంచులు కాయిత శోభా తిరుపతి, దందేర మహేష్, ఆకుల లింగాగౌడ్, ఒడిల రాజన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోరాటంలో అంబేద్కర్‌కు నివాళులు..

### - కార్మిక హక్కుల కోసం గళమెత్తిన సెక్యూరిటీ గార్డులు

### - మంత్రికి వినతి పత్రం - సమస్య పరిష్కారానికి హామీ

**మందమర్రి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల పోరాటం మధ్య డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కార్మికులు ఘనంగా నివాళులు అర్పించారు. హక్కుల ప్రదాత అంబేద్కర్ ఆశయాలను స్మరించుకుంటూ పోరాట నినాదాలతో కార్యక్రమం నిర్వహించారు. మందమర్రి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు సంబంధించిన టెండర్ ఆలస్యంతో సుమారు 220 కుటుంబాలు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో వారం రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా కార్మికులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగాల సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రంగు రాజేశం ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. డా. బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం – కార్మికుల హక్కులు అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా బడుగు, బలహీన వర్గాలకు హక్కులు సాధించిన మహోన్నత నాయకుడని పేర్కొన్నారు. నేడు ఆ హక్కులను హరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు కార్మిక వర్గ ఐక్య పోరాటాలే నిజమైన నివాళి అవుతాయని తెలిపారు. అనంతరం మందమర్రి ఏరియాకు వచ్చిన చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రికి సెక్యూరిటీ గార్డుల సమస్యపై ఎస్‌సీకేఎస్‌సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సమస్యను పరిశీలించి త్వరలోనే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని, ఏరియా జీఎంతో మాట్లాడతామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# బెల్లంపల్లిలో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గూడచులను స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి ప్రమాదాలను తగ్గించేందుకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శనలు నిర్వహించి, అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. అగ్నిమాపక శాఖ సేవలను అభినందించిన ఎమ్మెల్యే, అత్యవసర సమయాల్లో వారు అందించే సేవలు ఎంతో విలువైనవని అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం రోజున నుంచి జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జిల్లా అగ్నిమాపక అధికారి మాధవి భగవాన్ రెడ్డి పర్యవేక్షణలో బెల్లంపల్లి అగ్నిమాపక కేంద్రంలో ఈ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదాలు సంభవించే సందర్భాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ మార్గాలు, ప్రాథమిక భద్రత చర్యలపై ప్రజలకు వివరించారు. ముఖ్యంగా గృహాలలో, కార్యాలయాలలో అగ్ని ప్రమాదాలను నివారించేందుకు సరైన పరికరాల వినియోగంపై సూచనలు అందించారు. ఈ సంవత్సరం వారోత్సవాల థీమ్‌గా సురక్షిత పౌరులు – సురక్షిత ఆసుపత్రులు మరియు అగ్ని ప్రమాద భద్రత అవగాహన కలిగిన సమాజం అనే నినాదాన్ని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రజల్లో భద్రతా చైతన్యం పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో అగ్ని ప్రమాదాల వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. ఏప్రిల్ 14 నుంచి ఏప్రిల్ 20 వరకు (7 రోజుల పాటు) వివిధ అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా ఫైర్ విభాగం ఆధ్వర్యంలో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు వంటి ప్రదేశాలలో అగ్నిప్రమాద భద్రతపై ప్రత్యేక శిక్షణలు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రాధికారి సత్యనారాయణ, బి. శ్రీకుమార్, పి. చంద్రయ్య, కె. చంద్రశేఖర్, ఎన్. నారాయణ, జి. ప్రదీప్ కుమార్, ఆర్. రమేష్, కె. మహేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



డే కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## వయోవృద్ధులు డే కేర్ సెంటర్‌ను

# సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

వయోవృద్ధులు డే కేర్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జూబ్లీ మార్కెట్ లోని మహిళా, పిల్లల, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మెంగ్రే ఆకాష్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధులకు డే కేర్ సెంటర్ ద్వారా మెరుగైన సేవలు లభిస్తాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందించడంలో అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో సమన్వయంతో కృషి చేస్తుందని తెలిపారు. డే కేర్ సెంటర్ ఏర్పాటు వంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, సెక్షన్ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రవి, రాజంపేట సర్పంచ్ బుర్స పోచయ్య, కౌన్సిలర్లు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి

**వేమనపల్లి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**

భీమిని మండలంలోని రైతు వేదికలో 16న గురువారం రోజున ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించబడుతుందని బెల్లంపల్లి డివిజనల్ ఇంజనీర్ ఎ. రాజేశం, బెల్లంపల్లి రూరల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఈ. రవికుమార్ తెలిపారు. కావున వేమనపల్లి మండల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ప్రత్యక్షంగా చెప్పి ఫిర్యాదు చేయవచ్చని వేమనపల్లి మండల ఏఈ దీక్షిత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేమనపల్లి మండల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

# ట్రాఫిక్ నియమాలపై అవగాహనతోనే ప్రాణ రక్షణ: డీజీపీ శివధర్ రెడ్డి

**నిర్మల్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**




రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీకి గుస్సాడీ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడం వల్ల జరిగే ప్రమాదాలు కుటుంబాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ సురక్షితంగా ఇళ్లకు చేరుకోవడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి, అంబేద్కర్ జయంతి సందర్భంగా బాబాసాహెబ్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, సాయికిరణ్, డీపీఓ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తిర్యానిలో చలివేంద్రం ప్రారంభం

**తిర్యాని, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:**



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని వంశీ వెల్డింగ్ అండ్ ఇంజనీరింగ్ వర్క్స్ యజమాని మల్యాల అశోక్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాన్ని మంగళవారం అనిల్ అన్న యువ సైన్యం ఫౌండర్ జువ్వాజీ అనిల్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు, స్థానికులకు తాగునీటిని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ వేసవిలో ఎండలు తీవ్రమవుతున్న తరుణంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మల్యాల అశోక్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. మానవ సేవయే మాధవ సేవ అని సాటి మనిషి కష్టంలో ఉన్నప్పుడు ఆదుకోవడమే నిజమైన సేవాభావమని కొనియాడారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు రాకూడదని సూచించారు. ఎండల తీవ్రత నుండి తట్టుకోవడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాలను కాపాడుకోవాలని కోరారు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని జరగాలని, అప్పుడే సామాన్యులకు ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెరుమళ్ళ వెంకటేశం గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పడిగెల అమర్, తిర్యాని, గంభీరావుపేట, కన్నెపల్లి, నాయకపుగూడా సర్పంచ్‌లు మడవి రాజేష్, జుమ్మిడి కిష్టయ్య, తుమ్రం మాన్కు, ఏదుల సుమలత, ఉప సర్పంచ్ కొదురుపాక పవన్, బొక్కెనపల్లి మునీశ్వర్, రమేష్, రాజకుమార్, అరవింద్, రాజశేఖర్, వెంకటేష్, రాజేందర్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి

## - శ్రీరాంపూర్ సీఐ అశోక్ - అంబేద్కర్ గ్రౌండ్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

**నస్పూర్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త**




రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్

ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలని శ్రీరాంపూర్ సీఐ అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం నస్పూర్ మండలం శ్రీరాంపూర్ అంబేద్కర్ గ్రౌండ్‌లో స్థానిక అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం సింగరేణి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఒక పెను సమస్యగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని, హత్యల ద్వారా సంభవించే మరణాల కంటే రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్యే అధికంగా ఉందని సీఐ వివరించారు. పోలీసులు, ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా, వాహనదారులు తమ వ్యక్తిగత బాధ్యతగా భావించి నిబంధనలు పాటించినప్పుడే ఈ ప్రమాదాలకు చెక్ పెట్టగలమని స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల తమకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. అదేవిధంగా కారు నడిపే సమయంలో తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని, చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వకూడదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్, కార్పొరేటర్లు వేల్పుల రవీందర్, రాజేశ్వరి, సింగరేణి బీసీ ఉద్యోగుల సంఘం శ్రీరాంపూర్ బ్రాంచ్ సెక్రటరీ బరపటి మారుతి, తోకల సురేష్, పోలీస్ సిబ్బంది, అంబేద్కర్ సంఘం సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.